

అందని పశువైద్యం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పశు పోషకులు, రైతులు నష్టపోతున్నారు. 8లో▸



ఎక్కువ ధరకు విక్రయించొద్దు

ఎరువులు, విత్తనాలు, ఎమ్మార్పీకే విక్రయించాలని వ్యవసాయ కమిషనరేట్ ఆఫీస్ ఏడీఏ ఉషారాణి అన్నారు. 8లో▸

కోహెడ మార్కెట్‌కు రూ.350 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న కోహెడ మోడ్రన్ మార్కెట్ కోసం ప్రభుత్వం రూ.350 కోట్ల నిధులను రుణం రూపంలో మంజూరు చేసింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు వెల్లడించింది. ఈ నిధులతో మార్కెట్ మొదటి దశ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'సీఎం కప్' జిల్లా స్థాయి పోటీలు

డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు

హుడాకాంప్లెక్స్: సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాలని యువజన, క్రీడల జిల్లా అధికారి(డీఎస్‌డీఓ) వెంకటేశ్వర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ నెల 15 నుంచి 17 వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఇందులో సత్తాచాటిన వారు సోమవారం ఉదయం 8గంటలలోపు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కోచ్‌లతో పాటు హాజరై రిపోర్ట్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో 5 క్రీడాంశాలతో పాటు బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ (పురుషుల), హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్ (పురుషుల) పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 22న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వాలీబాల్, కబడ్డీ, 23న ఖోఖో, అథ్లెటిక్స్, 24న బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట వీఎంహోంలో ఫుట్‌బాల్, ఎల్‌బీనగర్ అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ మైదానంలో హ్యాండ్‌బాల్, గచ్చిబౌలి స్టేడియంలో రెజ్లింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తకు రూ.2 లక్షల బీమా చెక్కు



చెక్కు అందజేస్తున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సంగీత ఇటీవల పిడుగుపాటుతో మృతిచెందారు. ఆమెకు కాంగ్రెస్ సభ్యత్వం ఉండటంతో రూ.2 లక్షల బీమా మంజూరైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కావలి రాజు తెలిపారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆదివారం బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, బాల్‌రాజ్‌గౌడ్, వెంకట్రాములు, సత్యనారాయణ రెడ్డి, బాబర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి



కుమ్మరిగూడలో నిర్వహించిన మల్లన్న కల్యాణంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్: ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని కుమ్మరిగూడలో ఆదివారం మల్లన్న కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆలయాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ చేతన రమేష్‌యాదవ్, ఎంపీటీసీ దేశమల్ల అరుణ, గ్రామస్తులు ఉన్నారు.

శాంతికి మూలం ప్రేమే..

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: అన్ని వర్గాలను ప్రేమభావంతో సమానంగా చూసినప్పుడే దేశంలో శాంతి నెలకొంటుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ చైర్మన్, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సరూర్‌నగర్ స్టేడియంలో జాకబ్ అధ్యక్షతన జరిగిన క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనానికి క్రిస్టియన్ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రేమే శాంతికి మూలమని, యేసుప్రభు ప్రపంచానికి ప్రేమను పంచారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలవారిని సమానంగా గౌరవిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు ఎం.ప్రసాద్, డా.కే.సిన్హా, కే.మోజెస్, శంకర్‌లూక్, సామ్యూల్ పాల్గొన్నారు.

'మాసబ్'పై మాఫియా

- నక్షబాట పునరుద్ధరణ పేరుతో చెరువు మధ్యలోంచి రోడ్డు
- భారీ బండరాళ్లు.. లారీలతో మట్టి నింపుతున్న రియల్టర్లు
- చుట్టూ ప్రైవేటు సైన్యం పహారా.. రాత్రికి రాత్రే పూడ్చివేతలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- చెరువు శిఖం పూడ్చివేతల్లో పెద్దల హస్తం?



చెరువు శిఖంలో నిర్మిస్తున్న రోడ్డు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మాసబ్ చెరువుపై రియల్ మాఫియా ముప్పేట దాడి చేస్తోంది. చుట్టూ ప్రైవేటు సైన్యాన్ని పహారాగా ఏర్పాటు చేసి చెరువును చెరబట్టేస్తోంది. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండటంతో స్థానికులే చెరువు పరిరక్షణ కమిటీగా ఏర్పడి రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. అయినా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. మట్టి తరలింపు లారీలను లోనికి రాకుండా స్థానికులు ప్రధాన రోడ్డు వైపు నిఘా పెడితే .. అర్ధరాత్రి చెరువు వెనుక భాగం నుంచి పూడ్చివేతను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు నిత్యం ఈ చెరువుకట్టపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ.. వీరిలో ఇప్పటి వరకు ఏ ఒక్కరూ కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై స్థానికులు ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేకుండాపోయాడు.

రెండు నెలలుగా పూడ్చివేతలు..

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలో 495 ఎకరాల విస్తీర్ణంలో మాసబ్ చెరువు విస్తరించి ఉంది. దీనిలో ప్రభుత్వ భూమి 342.32 ఎకరాలు. మరో 152.38 ఎకరాలు ప్రైవేటు పట్టా భూములు. ఈ భూములన్నీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి. బఫర్ జోన్‌లో మరో 31.35 ఎకరాలు ఉంది. బఫర్‌జోన్‌లో 9.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, 22.5 ఎకరాల పట్టా భూమి ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న పట్టా భూములను ఏక్ ఫసల్ భూములుగా పిలుస్తుంటారు. చెరువులో నీరు తగ్గినప్పుడు మాత్రమే ఈ భూములను సాగు చేసుకునే అవకాశం ఉంది. నిజానికి ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలు చేపట్టకూడదు. కానీ ఇప్పటికే ఇక్కడ ఎఫ్‌టీఎల్ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, నిర్మాణాలు వెలిశాయి. గత మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా వచ్చి చెరువులోకి చేరింది. దీంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములన్నీ నీటమునిగాయి. ప్రభుత్వ శిఖం భూమిని ఆనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న ఈ పట్టా భూములను కొనుగోలు చేసిన కొంత మంది రియల్టర్లు రెండు నెలలుగా పూడ్చివేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.



చర్యలు తీసుకోవాలని అధికారులను నిలదీస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

కళ్లుగప్పి.. లారీల్లో మట్టి తరలించి..

చెరువు ఆనవాళ్లను దెబ్బతీస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొంత మంది స్థానికులు మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటికే శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీగా మట్టిని నింపారు. రియల్టర్లు నింపిన ఆ మటిని మళ్లీ ఎత్తిపోయించాలని అధికారులు నిర్ణయించారు. ఒకవైపు స్థానిక మున్సిపల్ అధికారులు ఇందుకు ఏర్పాట్లు చేస్తుండగా, ఈ విషయాన్ని గమనించిన సదరు రియల్టర్ కోర్టును ఆశ్రయించారు. ఒకవైపు ఈ వివాదం కొనసాగుతుండగా.. మరో వైపు మరో రియల్టర్ నక్షబాటను లక్ష్యంగా చేసుకుని చెరువు పూడ్చివేతకు పాల్పడుతున్నారు. కాగా.. సదరు కోర్టు స్టేటస్‌కో విధించినట్లు సమాచారం. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ ప్రధాన రహదారి వైపు ఏర్పాటు చేసిన గేటుకు ఓ నోటీసును కూడా అతికించారు. గేటుకు అతికించిన నోటీసు బోర్డును చూసి అధికారులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

- కళ్ల ముందే చెరువు శిఖం కబ్జాకు గురవుతుండటం, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలుస్తుండటాన్ని జీర్ణించుకోలేని స్థానికులు వాట్సాప్ గ్రూప్ వేదికగా ఒక్కటయ్యారు. గత పదిహేను రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. మట్టి లోడుతో కూడిన లారీలు లోపలికి వెళ్లకుండా రాత్రి పగలు తేడా లేకుండా అక్కడే కాపు కాస్తున్నా రు. ప్రధాన రహదారిపై నిఘా పెరగడంతో రియల్టర్లు ప్రత్యామ్నాయంగా, గతంలో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు గుర్రంగూడ నుంచి ఏర్పాటు చేసుకున్న నక్షబాటను ఇందుకు వేదికగా ఎంచుకున్నారు. అందరి కళ్లుగప్పి శనివారం అర్ధరాత్రి దాటాక పెద్ద ఎత్తున మట్టి డంప్ చేస్తుండటంతో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు టిప్పర్లను అడ్డుకుని, మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> స్థానికుల ఫిర్యాదుతో ఆదివారం పూడ్చివేతలను పరిశీలించాం. నక్షబాట పేరుతో పెద్ద ఎత్తున మట్టి, బండరాళ్లను వేసి పూడ్చివేస్తున్న వారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. చెరువు పరిసరాల్లో రెవెన్యూ, పోలీసు నిఘా పెంచుతాం.
>
> – గంగమ్మ, ఏఈఈ, ఇరిగేషన్



మహేశ్వరంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబిత

సంక్షేమంలో నంబర్ వన్

- అభివృద్ధిలో దేశానికే ఆదర్శం
- అన్నిరంగాల్లో దూసుకుపోతున్న తెలంగాణ
- సీఎం కేసీఆర్ శ్రమకు ఇదే నిదర్శనం
- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ కష్టానికి ఇదే నిదర్శనమని తెలిపారు. రూ.64 లక్షల నిధులతో మహేశ్వరంలో నిర్మించిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన భవనాన్ని ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, ప్రతీ ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున రైతుబంధు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనని తెలిపారు. రైతుబీమా అనేక కుటుంబాలకు ధీమాగా నిలుస్తోందని స్పష్టంచేశారు. పంటలకు మద్దతు ధర కల్పిస్తూ.. గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. మహేశ్వరంలో రూ.1.40 కోట్లతో నూతన మార్కెట్ కమిటీ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ, షెడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూర్గు రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీతానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మహేశ్వరం కోపరేటివ్ బ్యాంకు మేనేజర్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ షఫీ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు నాయక్ పలువురు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ ప్రారంభం

బంజారాల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. ఉప్పుగడ్డతండాలో ఆదివారం బంజారా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మహేశ్వరంలో రూ.4 కోట్లతో సంత్ సేవాలాల్, దుర్గమ్మ ఆలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. యాదాద్రి ఆలయ నిర్మాణానికి వాడిన శిలారాయినే వీటికి వాడుతున్నామని చెప్పారు. కేసీతండాలోని కొత్వాల్ చెరువు కట్టపై 40 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశామని స్పష్టంచేశారు. స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతానాయక్, బీఆర్ఎస్ నాయకులు లచ్చానాయక్, కూన యాదయ్య, అంగోత్ రాజునాయక్, నేనావత్ ఈశ్వర్‌నాయక్, సర్పంచ్‌లు ఎం.రాజునాయక్, శివినాయక్, మోతిలాల్ నాయక్, నేజీరెడ్యా నాయక్, సాలీ నాయక్, హర్షగూడ ఎంపీటీసీ విజయ్ నాయక్, బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొత్వాల్‌గూడ మున్సిపాలిటీ కార్యాలయం

'ఎనిమి' సంగతి ఏమాయే?

- 111 జీఓ ఎత్తేసినా ప్రయోజనం లేని కొత్వాల్‌గూడ
- ఇప్పటికీ అక్కడ రైతుబంధు, రైతు బీమా లేదు
- 650 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీలోనే
- ఎటూ తేల్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

శంషాబాద్: రాష్ట్ర సర్కారు ఇటీవల జీఓ 111ను పూర్తి స్థాయిలో ఎత్తివేసినట్లు చేసిన ప్రకటన.. ఈ పరిధిలోని అన్ని గ్రామాలు, బస్తీల్లోని ప్రజలకు ఎంతో కొంత సంతోషాన్ని కలిగించింది. కానీ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ రైతులు, భూ యజమానుల్లో మాత్రం ఆ ఛాయలు ఏ మాత్రం లేవు. దశాబ్దాలుగా భూములు సాగు చేస్తున్న రైతులకు సర్కారు జారీ చేస్తున్న రైతుబంధు, రైతుబీమాలు కూడా లేవు. అత్యవసరాల కోసం భూమిని విక్రయించుకునే వెసులుబాటు లేదు. జీఓ 111 మించిన సమస్య కొత్వాల్‌గూడ వాసులకు శత్రువుగా మారింది. అదే 'ఎనిమి ప్రాపర్టీ'. ఇది.. పేరులాగే అక్కడి రైతుల పాలిట శత్రువుగా మారింది. అరవై ఏళ్లుగా సాగుచేస్తున్న రైతులు అవస్థల పాలయ్యేలా చేస్తోంది.

అసలు విషయం ఏమిటి?

అప్పట్లో కొత్వాల్‌గూడ జాగీర్దారుగా ఉన్న సయ్యద్ హసన్ అబేదీ వారసుడు ఖమ్రుద్దీన్ వారసత్వంగా తనకు దక్కిన 650 ఎకరాల భూమిని 1967లో ముంబైలోని కస్టోడియన్ ప్రాపర్టీకి అప్పగించి పాకిస్తాన్ వెళ్లి స్థిరపడ్డాడు. ఇలా అప్పగించిన సదరు భూములను కేంద్ర హోంశాఖ పరిధిలోని ఎనిమి ప్రాపర్టీ కింద కస్టోడియన్ ఆఫ్ ఎనిమి ప్రాపర్టీ పరిధిలోకి వెళ్లిపోయాయి. మరోవైపు 1969 వరకు స్థానికంగా ఉన్న సయ్యద్‌హసన్ అబేదీ ఇక్కడి రైతులకు తన భూములను విక్రయించాడు. ఆయన వద్ద భూములు కొనుగోలు చేసిన సుమారు 200 పైచిలుకు రైతులు పట్టా, పహణీలతో పాటు 38ఈ భూ యజమాన్య హక్కుపత్రాలను రాష్ట్ర రెవెన్యూ విభాగం నుంచి పొందడంతో పాటు ఏళ్లుగా పన్నులు సైతం చెల్లిస్తూ భూములను సాగు చేసుకోవడం ఇతరత్రా పనులతో జీవనోపాధి పొందుతున్నారు.

ఏడేళ్ల కిందట పిడుగులా..

ఏడు సంవత్సరాల క్రితం కేంద్ర హోంశాఖ పరిధిలోని కస్టోడియన్ ప్రాపర్టీ బోర్డు నుంచి కొత్వాల్‌గూడలోని సర్వేనంబరు 1 నుంచి 174 పరిధిలో మొత్తం 650 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీ ఉందని జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక రెవెన్యూ అధికారులకు లేఖలు అందాయి. దీంతో ఒక్కసారిగా రైతుల గుండెల్లో పిడుగు పడింది. సదరు భూములకు కొత్త పాస్‌బుక్‌లు సైతం రాష్ట్ర సర్కారు జారీ చేసింది. కస్టోడియన్ ఆఫ్ ఎనిమి ప్రాపర్టీ ఆదేశాల మేరకు మూడేళ్ల క్రితం కొత్వాల్‌గూడ భూముల రిజిస్ట్రేషన్‌లను సైతం నిలిపివేశారు. అప్పటి నుంచి భూములు ఎక్కడ కోల్పోతామోననే దిగులుతో రైతులు బతుకులీడిస్తున్నారు.

ఏడాదిన్నర క్రితం మళ్లీ..

- 2021 అక్టోబరులో ముంబై కస్టోడియన్ ప్రాపర్టీ కార్యాలయం నుంచి అధికారులు మరోసారి రంగంలో దిగారు. ఎనిమి ప్రాపర్టీలో ఉన్న రైతులు కొందరికి నోటీసులు సైతం జారీ చేశారు. కొత్వాల్‌గూడ వార్డు కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఎనిమి ప్రాపర్టీ సూచిస్తున్న సర్వే నంబర్లలోని భూ యజమానులు ఈ మెయిల్, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా వివరాలను పంపాల్సిందని సూచించారు.
- భూ యజమానులకు సగం యజమాన్య హక్కులు కచ్చితంగా దక్కుతాయని మిగతా సగం భూములకు వేలంలో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత కల్పిస్తామని సూచించారు. దీనిపై కొత్వాల్‌గూడ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నేతలతో పాటు అధికార పార్టీ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే సహా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కొత్వాల్‌గూడ వాసులు ఆందోళన విరమించారు. కానీ కస్టోడియన్ అధికారుల పత్తా లేదు. సదరు భూముల క్రయవిక్రయాలకు ఇప్పటి వరకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. తాజాగా జీఓ 111 తొలగిస్తున్నట్లు ప్రకటించినా ఎనిమి సమస్య తీరే వరకు స్థానికులకు ఎలాంటి ప్రయోజనం లేదు.

బదిలీ.. ప్రమోషన్ లేదు!



- కోర్టు కేసులతో ఆగిన ప్రక్రియ
- ఆందోళనలో ఉపాధ్యాయులు
- ప్రస్తుత సెలవుల్లోనైనా పూర్తి చేయాలని డిమాండ్

షాబాద్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టత నివ్వడం లేదు. దీంతో చానాళ్లుగా టీచర్లు మదన పడుతున్నారు. ఉద్యోగులకో తీరు.. ఉపాధ్యాయులకో తీరా..? అంటూ పోరాటానికి సిద్ధమవుతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తొమ్మిదేళ్ల పాలనలో ఒకేసారి 2015లో టీచర్లకు పదోన్నతులు కల్పించింది. ఆ తర్వాత ఈప్రక్రియకు మంగళం పాడడంతో అన్ని అర్హతలు ఉన్న ఎంతోమంది ప్రమోషన్లకు నోచుకోకుండానే రిటైరవుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జనవరిలో ప్రారంభమైన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోవడంతో టీచర్లలో ఆందోళన నెలకొంది.

దరఖాస్తులు స్వీకరించినా..

విద్యాశాఖలో ప్రమోషన్లు ఇస్తామని, ట్రాన్స్‌ఫర్లు చేపడతామని ప్రభుత్వం జనవరిలో షెడ్యూల్ ప్రకటించి దరఖాస్తులు స్వీకరించింది. బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్నవారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో తమకు అన్యాయం జరుగుతోందని నాన్ స్పౌజ్ టీచర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయాయి. వేసవి సెలవుల్లోపు ఈప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ సాధారణ ఎన్నికలు ఉన్నందున.. ఇప్పుడు చేపట్టకపోతే మరో ఏడాది వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నాయి.

అర్హత ఉన్నా దక్కని ఫలితం

ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడి(ఎస్‌జీటీ)గా ఉద్యోగంలో చేరిన వారిలో కొందరు 25ఏళ్ల సర్వీసు పూర్తి చేసినా.. ప్రమోషన్‌కు నోచుకోక అదే కేడర్‌లో పని చేస్తున్నారు. చివరకు అదే హోదాలో విరమణ పొందుతున్నారు. జీహెచ్‌ఎం, ఎంఈఓ, ఎస్‌ఏలుగా ప్రమోషన్ పొందుతామనుకున్న వారి ఆశలు ఆవిరవుతున్నాయి. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోవడంతో కొందరు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేసి సచివాలయం నుంచి నేరుగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు తెచ్చుకుని జిల్లాలోని తమకు అనుకూలమైన స్థానాల్లో పోస్టింగ్ తీసుకున్నారు. ఇలా పలుకుబడి ఉన్నవారు పదుల సంఖ్యలో బదిలీలు పొందినట్లు టీచర్లు ఆరోపిస్తున్నారు.

ఖాళీలతో అవస్థలు

జిల్లాలో 25 మండలాల్లో ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వివిధ రకాల కేటగిరీల్లోని 500 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. జిల్లాలోని 1,155 పాఠశాలల్లో 6,120 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, వివిధ కేటగిరీలకు చెందిన 500 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని బదిలీలు, పదోన్నతుల ద్వారా పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వం కోర్టు కేసుల పేరిట కాలయాపన చేయడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. త్వరగా ప్రక్రియ పూర్తిచేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

> **నాన్చివేత సరికాదు**
>
> 
>
> విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నాన్చివేత వైఖరి సరికాదు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను, కోర్టు కేసులను వెంటనే పరిష్కరించాలి. బోధన, బోధనేతర సిబ్బంది, పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీలుగా ఉండటంతో విద్యాశాఖ గాడి తప్పుతోంది.
>
> – బందయ్య, టీపీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు

> **ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు**
>
> 
>
> ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించకుండా దశాబ్దంన్నరగా కాలయాపన చేస్తూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. వేసవి సెలవుల్లోనైనా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి.
>
> – సురధీర్, టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు

సాంకేతిక అభివృద్ధికి రాజీవ్ పునాది

- పేదల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారు
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- మాజీ ప్రధానికి ఘనంగా నివాళి

తుక్కుగూడ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం తుక్కుగూడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రాజీవ్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. దేశంలో సాంకేతిక రంగం అభివృద్ధికి ఆయనే పునాది వేశారని తెలిపారు. రాష్ట్రంతో పాటు దేశంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే ఆయనకు అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంపన్న యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జానకిరామ్, శివగల్ల యాదయ్య, బాకీ నవీన్, కప్పల రాజు, బ్యాగరి మహేందర్, సునీల్, పాండు రంగారెడ్డి, దర్శన్, యాదగిరి,రాజ్ కుమార్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



తుక్కుగూడలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చల్లా నర్సింహారెడ్డి

ఎక్కువ ధరలకు విక్రయించొద్దు

ఏడీఏ ఉషారాణి



తలకొండపల్లి: ఫెర్టిలైజర్స్ షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ, ఎస్‌ఓటీ అధికారులు

తలకొండపల్లి: ప్రభుత్వం సూచించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులను విక్రయించాలని వ్యవసాయ కమిషనరేట్ ఆఫీస్ ఏడీఏ ఉషారాణి అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల షాపులను ఆమె ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, సీడ్ సర్టిఫికేషన్ అధికారి కె.నరేష్‌లతో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ధరల పట్టిక, స్టాక్, నిల్వ, తదితర రిజిష్టర్‌లు, రికార్డులను తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు ఖచ్చితంగా రశీదులు ఇవ్వాలన్నారు. రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు రశీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఎమార్పీ ధరల కంటే విక్రయించినట్లు రుజువైతే సదరు యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తి విత్తనాలకు సంబంధించిన గోదాంలు, స్టాక్‌లు, ఇన్వాయిస్‌లు, రిజిష్టర్‌లను తనిఖీ చేసి హెచ్‌టీ కాటన్ విత్తనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌టీం సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ ఉషారాణి హెచ్చరించారు. పట్టణంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రం, సూర్య అగ్రి షాప్, శ్రీ మహీంద్రా ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్, వాసవి ఫర్టిలైజర్స్, నాగార్జున ఆగ్రో కెమికల్స్ తదితర ఎరువుల దుకాణాలలో ఆదివారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్‌టీం బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం బృందం సభ్యులు, ఏడీఏ ఉషారాణి, శంషాబాద్ ఎస్‌ఓటీ సీఐ సత్యనారాయణ, సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ అధికారి నగేశ్‌లు ఆయా షాపులలో ఉన్న రిజిష్టర్లు, స్టాకు, విత్తనాలను తనిఖీ చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్తి విత్తనాలలో హెర్బిసైడ్ టాలరెంట్ జన్యువు ఉందా లేదా అని పరీక్ష చేశారు. విత్తనాలకు సంబంధించిన రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌ల బిల్లులు తదితర వివరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాలలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన వడ్డెర సంఘం నేతలు



మంత్రి సబితారెడ్డికి పూల బొకే అందజేస్తున్న నాయకులు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలకు వడ్డెర సంఘం కమ్యూనిటీ భవనాల మంజూరుకు మంత్రి సబితారెడ్డి హామీ ఇవ్వడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకార్యదర్శి, మీర్‌పేట కార్పొరేటర్ వేముల నర్సింహ ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. నియోజకవర్గంలో దాదాపు 28 వేలకు పైగా జనాభా కలిగి ఉన్న వడ్డెరులు నేటికీ సొంత ఇల్లు లేకుండా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం అందజేసే డబుల్ బెడ్‌రూం పథకంలో వడ్డెరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు వరికుప్పల శ్రీశైలం, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు అశోక్, మంజల నగేష్, కార్యదర్శి వరికుప్పల వెంకటేష్, పల్లపు శంకర్, జిల్లా నాయకులు డేరంగుల నర్సింహ, గండికోట యాదయ్య, మాగని అంజయ్య ఉన్నారు.

అందని పశువైద్యం

వేధిస్తున్న సిబ్బంది కొరత
- అందుబాటులో ఉండని మందులు
- అవస్థల్లో పశుపోషకులు, రైతులు



షాబాద్ మండలం తాళ్లపల్లిలో మూత పడిన పశువైద్య ఉపకేంద్రం

షాబాద్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అస్వస్థతకు గురైన జీవాలను పశువైద్యశాలకు తీసుకెళ్తే మందులు అందుబాటులో లేవంటున్న సిబ్బంది, బయట కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఐదారేళ్లుగా ఇదే దుస్థితి నెలకొందని పశుపోషకులు మండిపడుతున్నారు. ముఖ్యంగా పలు రోగాల బారిన పడి గొర్రెలు, మేకలు పెద్ద సంఖ్యలో మృతిచెందుతున్నాయని చెబుతున్నారు. మూడు నెలలకోసారి మందులు పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో వీటిని సక్రమంగా వినియోగించడం లేదనే ఆరోపణలున్నాయి. షాబాద్ పశువైద్యశాల పరిధిలో సర్దార్‌నగర్, మాచన్‌పల్లి, బోడంపహాడ్ ఉన్నాయి. ఈ సబ్ సెంటర్లలో అవసరమైన మేర సిబ్బంది లేరు. రేగడిదోస్వాడ పశువైద్యశాల కింద ఉన్న తాళ్లపల్లి, పోతుగల్, చందనవెళ్లి పశువైద్యశాలల్లో డాక్టర్లు లేక మూతపడ్డాయి. అటెండర్ల పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. సుమారు ఐదేళ్ల క్రితం అవుట్ సోర్సింగ్ కింద మండలంలో ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను తీసుకుని, వీరితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో పశుపోషకులు, రైతులకు అవస్థలు తప్పడం లేదు. రోగాల బారిన పడిన పశువులను మండల కేంద్రంలోని దవాఖానాకు తీసుకెళ్లాలంటే వాహనం అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. పశువులను వాహనం ఎక్కించడానికి, దింపడానికి కూలీల ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికైనా వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి గ్రామాల్లో పశువులకు వైద్యం అందించాలని పాడి రైతులు, కాపరులు కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



పశు వైద్యశాలలో కొన్ని రకాల మందులే ఉంటున్నాయి. దీంతో ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. సిబ్బంది నియామకం చేపట్టి మందులను అందుబాటులో ఉంచాలి.

– కుమ్మరి సత్తయ్య, పాడి రైతు, తాళ్లపల్లి

ప్రతిపాదనలు పంపాం



సిబ్బంది కొరత వాస్తవమే. కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం మందుల కొరత లేదు.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి రేగడిదోస్వాడ

వ్యాధులతో జాగ్రత్త

మొయినాబాద్, రూరల్: గొర్రెలు, మేకలకు నీలి నాలుక, గెటికల రోగం, గాలికుంటు వ్యాధులు ప్రమాదకరంగా మారాయి. వీటి బారిన పడిన జీవాలు మృతి చెందడంతో కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందస్తు జాగ్రత్తలతో జీవాలను రక్షించుకోవచ్చని మొయినాబాద్ కనకమామిడి, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీలత సూచించారు.

నీలి నాలుక లక్షణాలు

ఈ వ్యాధి ప్రధానంగా గొర్రెలకు సోకుతుంది. పెదవులు, నాలుకకు వాపు వస్తుంది. నాలుక నీలిరంగుకు మారి నోట్లో పుండ్లు ఏర్పాడతాయి. దీంతో నోట్లో నుంచి చొంగ కారుతూ తరచూ జ్వరానికి గురవుతాయి. మేత మేయలేక నీరసించి మత్యువాత పడే అవకాశముంటుంది. నాలుక, పెదవులతో పాటు గెటికలపై భాగం వాపు రావడంతో నడవలేవు.

జాగ్రత్తలే రక్ష



గొర్రెల్లో కుంటు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. నీలినాలుక ప్రభావం పెద్దగా లేదు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే జీవాలను కాపాడుకోవచ్చు. జీవాలకు ఏ సమస్య ఎదురైనా వెటర్నరీ ఆస్పత్రికి తీసుకురావాలి.

– శ్రీలత, పశువైద్యాధికారి, కనకమామిడి

నివారణ చర్యలు

- వ్యాధి కారకాలైన దోమల కాటుకు గురి కాకుండా చూసుకోవాలి.
- చీకటి పడిన తర్వాత, వేకువ జామున మందల పక్కన మంట పెట్టి వేపాకుతో పొగ పెట్టాలి.



కేతిరెడ్డిపల్లిలో మేకల మంద...

- చెరువులు, కుంటలు, నీటి నిల్వ ప్రదేశాల్లో మందలను ఆపరాదు.
- వైద్యుల సలహా మేరకు ఆక్సిటెట్రాసైక్లిన్ పౌడర్ లేదా సిప్రోఫ్లాక్సిసిన్ పౌడర్‌ను కాచి చల్లార్చిన నీటిలో కలిపి రెండు నుంచి మూడ్రోజులు జీవాలకు తాపాలి.

గెటికల వ్యాధి లక్షణాలు, నివారణ

- చౌడునేల, ముళ్లల్లో గొర్రెలను నడిపించడం వల్ల గిట్టలకు గాయాలు ఏర్పడి పుండ్లు తయారవుతాయి.
- వర్షాల వల్ల పుండ్లు తొందరగా తగ్గక గెటికలు వాచి చీముకారుతుంది. జీవాలు నడవలేవు.
- ఒక శాతం ఫార్మాలిన్ రసాయనం నీటిలో కలిపి గెటికెలకు అద్దాలి.
- గెటికలపై పుండ్లు ఏర్పడితే రెండు రోజులకోసారి పొటాషియం పర్మాంగనేట్‌తో గిట్టలను కడగాలి.
- బోరిక్‌పౌడర్, గ్లిజరిన్ కలిపి గిట్టలకు అంటించాలి.

నేటి నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం నుంచి జరుగనున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన సీఎం కప్ పోటీలు 2వ దశకు చేరుకున్నాయన్నారు. 33 జిల్లా కేంద్రాలలో ప్రారంభమయ్యే పోటీలకు స్థానిక జిల్లా మంత్రులు, శాసన సభ్యులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని తెలియజేశారు. స్థానిక జిల్లా కలెక్టర్లు ఛైర్మన్‌గా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన జిల్లాస్థాయి పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7కు పోటీలను ప్రారంభించి 10 గంటలకు ముగించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి అంబులెన్స్ డ్రైవర్ మృతి

శంకర్‌పల్లి: బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగాపురం శివారు కంది– షాద్‌నగర్ మార్గంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. శంకర్‌పల్లి ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావులపల్లి కలాన్‌కు చెందిన ప్రవీణ్(28) అంబులెన్స్ వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి ఒంటిగంటకు శేరిలింగంపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా సింగాపురం శివారులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సమయంలో తలకు బలమైన గాయం కావడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శునకానికి భయపడి.. మూడో అంతస్తు పైనుంచి దూకి..

- తీవ్రంగా గాయపడిన డెలివరీ బాయ్
- ఆసుపత్రికి తరలింపు



ఇలియాజ్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మణికొండ: డెలివరీ పార్సిల్‌ను అందించేందుకు వచ్చిన ఓ యువకుడు...పెంపుడు కుక్క అరవడంతో భయపడి అపార్టుమెంట్ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. దీంతో తీవ్రగాయాల పాలవగా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలోని శ్రీనిధి హైట్స్ అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో అద్దెకు ఉంటున్న నీలారాణి మూడు రోజుల క్రితం అమెజాన్‌లో పరుపు(బెడ్)ను ఆర్డర్ చేసింది. దాంతో ఆదివారం దాన్ని తీసుకుని డెలివరీ బాయ్ ఇలియాజ్ వారి ఇంటికి లిఫ్ట్‌లో వచ్చాడు. అతను తెచ్చిన బెడ్‌ను తలుపు తెరచి ఉండటంతో ఇంట్లోకి నేరుగా వచ్చి హాల్‌లో వేశాడు. దాని చప్పుడుకు ఇంట్లో ఉన్న లాబ్ జాతి కుక్క ఒక్కసారిగా అరవటంతో అతను భయపడి పోయాడు. ఆ సమయంలో కుక్క ఎక్కడ కరుస్తుందో అనే భయంతో ఏకంగా మూడవ అంతస్తు బాల్కనీ నుంచి కిందకు దూకాడు. నేరుగా అపార్ట్‌మెంట్ ప్రహరీగోడపై పడటంతో నడుము భాగంలో గాయమయ్యింది. దీంతో నీలారాణి భర్త డాక్టర్ సుబ్బరామిరెడ్డి సపర్యలు చేసి 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి పంపారు. డెలివరీ బాయ్ ఉదయం ఫోన్ చేసి ఈరోజు డెలివరీ చేస్తామని చెప్పాడని, వచ్చే ముందు ఎలాంటి ఫోన్ చేయటం, ఇంటి ముందుకు వచ్చి బెల్ కొట్టడం చేయలేదని, నేరుగా ఇంట్లోకి రావడం వల్లే కుక్క అరిచిందని నీలారాణి తెలిపారు. బాధితుడు తన అన్నకు ఫోన్ చేయటంతో ఓవైసీ ఆసుపత్రికి తీసుకుని రావాలని చెప్పటంతో 108 సిబ్బంది అతన్ని అక్కడకు తరలించినట్టు సమాచారం. రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సమాచారం సేకరించారు.

భక్తిభావాలతో మానసిక ప్రశాంతత



రాకింగ్ రాకేశ్‌ను సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

శంకర్‌పల్లి: ఆకుపచ్చ మరఖత శివ లింగాలు చాలా అరుదుగా ఉంటాయని జబర్దస్త్ నటుడు రాకేశ్ (రాకింగ్) అన్నారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా చందిప్పలోని మరఖత శివాలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజ, అభిషేకం చేయించారు. భక్తిభావాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఆలయ చైర్మన్ సదానందం, కమిటీ సభ్యులు, పూజారులు అతన్ని శాలువాతో సన్మానించారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద



తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

కవాడిగూడ: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు అని, వారిని పిల్లలు పూజించాలని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో గత 15 రోజులుగా నిర్వహించిన వేసవి సంస్కార్ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం సమ్మర్ క్యాంపులో పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదం పొందారు. నాలుగవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు గత 15 రోజులుగా సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విషయం విదితమే. చివరిరోజు వారి తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థుల చేత పాదపూజ చేయించి నిర్వాహకులు శిబిరాన్ని ముగించారు. స్వామి బోధమయానంద మాట్లాడుతూ..తల్లిదండ్రులకు పాదపూజ చేయడం మంచి సంప్రదాయమన్నారు. ఇది తరతరాలుగా వస్తున్న భారతీయ సంస్కృతి అని చెప్పారు. కార్యక్రమంలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని రామకృష్ణ మిషన్ నుంచి స్వామి హరిప్రేమానంద, రామకృష్ణ మఠంలో స్వాములు, ప్రముఖులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ లావాదేవీలు!

స్పూఫింగ్ పేమెంట్ యాప్‌లతో డేంజర్
- మెసేజ్ వచ్చినా ఖాతాలో నగదు జమకాని వైనం..
- దీంతో ఆర్థికంగా నష్టపోతున్న దుకాణదారులు

సాక్షి, సిటీబ్యూరో: కస్టమర్ కేర్ ఫోన్ నంబర్లు, వెబ్‌సైట్లు, ఈ–మెయిల్ ఐడీలను స్పూఫింగ్ చేసి నకిలీవి సృష్టించి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులు..కొత్తగా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు (యాప్)లను కూడా నకిలీవి సృష్టిస్తున్నారు. డీమానిటైజేషన్ తర్వాతి నుంచి నగదు లభ్యత తగ్గడంతో చాలా మంది డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ లావాదేవీలు బాగా పెరిగాయి. చిన్న కిరాణా షాపులు, కూరగాయల బండ్ల మీద కూడా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు కనిపిస్తున్నాయి. యాప్ పేమెంట్ వినియోగం విరివిగా అందుబాటులోకి రావటంతో మోసగాళ్లు వీటినీ అవకాశంగా మలుచుకుంటున్నారు.

ఎలా చేస్తారంటే?

కొందరు కస్టమర్లు రిటైల్ షాపులలో ఈ స్పూఫింగ్ యాప్‌లతో లావాదేవీలు జరిపి దుకాణదారులను మోసాలకు గురి చేస్తున్నారు. ముందుగా కస్టమర్లు వారి సెల్‌ఫోన్‌లో గూగుల్ స్టోర్ వంటి యాప్ డౌన్‌లోడ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి స్పూఫింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. షాపింగ్ చేశాక కొనుగోలుదారుల మొబైల్‌లోని స్పూఫింగ్ ఈ–వ్యాలెట్‌లో షాప్ పేరు, ఫోన్ నంబర్, అమౌంట్ వంటి వివరాలను నమోదు చేసి ఎంటర్ చేస్తారు. దీంతో షాప్ యజమాని ఫోన్ నంబర్‌కు పేమెంట్ పూర్తయినట్లు నకిలీ నోటిఫికేషన్ వెళుతుంది. వాస్తవానికి ఓనర్ బ్యాంక్ ఖాతాలో మాత్రం నగదు జమ కాదు.

ఏం చేయాలంటే..

సాధారణంగా షాపు యజమానులు సెల్‌ఫోన్‌లో సందేశం చూసుకొని నగదు వచ్చేసిందనుకుంటారు. బ్యాంక్ అకౌంట్‌ను ఓపెన్ చేసి నగదు జమ అయిందో లేదో యజమాని చూసుకునే సమయం ఉండదు. తీరా ఖాళీ సమయంలో అకౌంట్‌లో చూసుకుంటే ఆ నోటిఫికేషన్ తాలుకు పేమెంట్ జమై ఉండదు. దీంతో తాను మోసపోయానని తెలుసుకుంటాడు. ఒకవేళ షాప్ యజమాని పేమెంట్ జరిగిన వెంటనే ఖాతాలో చూసుకున్నా.. డేటా, సాంకేతిక సమస్య వల్ల ఖాతాలో అప్డేట్ ఆలస్యమవుతుందని కస్టమర్లు యజమానిని ఒప్పిస్తున్నారు. ఇలాంటి నకిలీ లావాదేవీలకు సౌండ్ బాక్స్‌తో చెక్ పెట్టొచ్చని యూపీఐ నిర్వాహకులు సూచిస్తున్నారు. పేమెంట్ జరిగిందా లేదో తక్షణమే తెలుసుకునేందుకు సౌండ్ బాక్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్, వాలెట్, డెబిట్, క్రెడిట్ కార్డ్స్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లు ఏ మాధ్యమం ద్వారా అయినా సరే పేమెంట్ చేయగానే, ఖాతాలో నగదు జమ కాగానే సంబంధిత లావాదేవీ జరిగినట్లు సౌండ్ బాక్స్‌లో వాయిస్ వస్తుంది.